నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
3 | సోమవారం 10 జూన్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

నెక్కొండ ఉపాధ్యాయుడికి ఇస్రో ఆహ్వానం

కిశోర్

నెక్కొండ, జూన్ 9: నెక్కొండ జడ్పీహెచ్ ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పూస కిశోర్‌కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్(ఐఐఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐదు రోజుల శిక్షణకు ఆహ్వానం అందింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), ఐఐఆర్ఎస్ సంయుక్తంగా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో కిశోర్‌కు అవకాశం దక్కింది. ఈయన స్థానిక ఉన్నత పాఠశాలలో హిందీ పండితుడిగా పనిచేయడంతోపాటు కొన్నేళ్లుగా సైన్స్ అండ్ టెక్నాలజీ, స్కూల్ ఇన్నోవేటివ్ చాలెంజెస్ తదితర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 10 నుంచి 14 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణకు కిశోర్ ఎంపికయ్యారు. 'స్పేస్ టెక్నాలజీ, అనువర్తనాలు' అంశంపై శిక్షణ ఉంటుందని కిశోర్ తెలిపారు. ఐఐఎస్ఆర్ నిర్వహించే శిక్షణకు కిశోర్ ఎంపికపై హెచ్ఎం రంగారావు, సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిశోర్‌ను స్టేట్ కన్జ్యూమర్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్ బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ అభినందించారు.

కేసీఆర్‌తో మాజీ ఎంపీ కవిత

కేసీఆర్‌ను కలిసిన కవిత

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఆదివారం ఎర్రవెల్లిలో పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె వెంట స్నేహితురాలు హరిత ఉన్నారు.

వరంగల్‌లో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

వరంగల్ నగరంలో పరీక్ష రాసేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు

గ్రూప్-1 పరీక్ష ప్రశాంతం

వరంగల్ నగరంలో గ్రూప్-1 పరీక్ష రాసేందుకు వచ్చిన దివ్యాంగుడిని కేంద్రంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది

ప్రిలిమినరీకి ఐదు జిల్లాల్లో 34,113 మంది హాజరు

- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు, సీపీ
- నిమిషం ఆలస్యంతో వెనుదిరిగిన అభ్యర్థులు

గ్రూప్-1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ప్రిలిమినరీ పరీక్షకు ఐదు జిల్లాల్లో 34,113 మంది హాజరయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 17 కేంద్రాల్లో 4,473 మంది అభ్యర్థులకు 3,331 మంది పరీక్ష రాశారు. జనగామలోని 14 కేంద్రాల్లో 3,697 మంది అభ్యర్థులకు 2,949 మంది హాజరయ్యారు. మహబూబాబాద్‌లో 4,412 మందికి 3,377 మంది పరీక్ష రాశారు. వరంగల్‌లో 9,092 మంది అభ్యర్థులకు 6622 మంది పరీక్షకు హాజరయ్యారు. హనుమకొండలో 45 కేంద్రాల్లో 22,665 మంది అభ్యర్థులకు 17,834 మంది పరీక్ష రాశారు. నిమిషం ఆలస్యంగా చేరుకున్న వారికి పోలీసు అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో వారు కన్నీటి పర్యంతమై వెనుదిరిగారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్లు భవేశ్‌మిశ్రా, షేక్ రిజ్వాన్ బాషా, ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, ఎస్పీ రాంనాథ్ కేకన్ పరిశీలించారు. కాగా, హంటర్‌రోడ్‌లోని గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌లో థర్డ్‌జెండర్ నేహ అలియాస్ పాల్తియా లక్ష్మణ్ పరీక్ష రాసింది.

- నమస్తే నెట్‌వర్క్, జూన్ 9

గ్రూప్-1 పరీక్షకు హాజరైన ట్రాన్స్‌జెండర్ నేహ

జనగామలో గేటుకు తాళం వేయడంతో వెళ్లిపోతున్న అభ్యర్థి

టేకులగూడెం చెలక గ్రామాన్ని సందర్శించి కుళాయి ద్వారా నీటిని సరఫరా చేయించి పరిశీలిస్తున్న ములుగు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సుభాష్, డీఈఈ వెంకట సతీశ్

టేకులగూడెం చెలకకు నీళ్లొచ్చాయ్

గ్రామాన్ని సందర్శించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

నమస్తే ఎఫెక్ట్

వాజేడు, జూన్ 9 : మండలంలోని టేకులగూడెం చెలక గ్రామానికి తాగునీళ్లు వచ్చాయి. 'గోదావరి నీళ్ల కోసం..' శీర్షికన గ్రామస్తులు కాలినడకన రెండు కిలోమీటర్లు వెళ్తున్నారని 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ములుగు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు ఈఈ సుభాష్, డీఈఈ వెంకట సతీశ్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులపై గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. గోదావరి నుంచి నీళ్లు సరఫరా చేసే మోటర్ మరమ్మతులకు గురవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల రెండు రోజులుగా గ్రామంలోని మోటర్ ద్వారా నీరు సరఫరా కావడం లేదని తెలిపారు. దీంతో అధికారులు మోటర్ ద్వారా గ్రామంలోకి నీటి సరఫరా చేయించారు. ఈ నీటిని కూడా తాగాల్సి ఉండగా గ్రామస్తులు గృహావసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. కాగా, గ్రామస్తులు తాగేందుకు ఉపయోగించే గోదావరి నీటి సరఫరా కోసం మోటర్ మరమ్మతు చేయించామని, సోమవారం మోటర్ బిగించి సరఫరా చేయనున్నట్లు డీఈఈ వెంకటసతీశ్ తెలిపారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

లక్నవరంలో నీరు లేక దర్శనమిస్తున్న వేలాడే వంతెన

లక్నవరంలో బోటు షికారు బంద్

- నీరు లేక నిలిపివేసిన టూరిజం సిబ్బంది
- తూముల రిపేర్‌తో నీటిని వదిలిన ఐబీ అధికారులు
- సందర్శనకు వచ్చి నిరుత్సాహంతో వెళ్తున్న పర్యాటకులు

గోవిందరావుపేట, జూన్ 9: పర్యాటక ప్రాంతమైన లక్నవరం సరస్సులో నీరు లేక అధికారులు బోటు షికారు నిలిపేశారు. దీంతో పర్యాటకులు నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్తున్నారు. జూన్ 2వ తేదీ నాటికి సరస్సులో 17అడుగుల నీటిమట్టం ఉండటంతో తూములు రిపేరు చేయాలంటూ ఐబీ అధికారులు నీటిని వదిలారు. దీంతో సరస్సు డెడ్ స్టోరేజ్‌కు వచ్చింది. బోట్లు నడిచేందుకు సరస్సులో సరిపడా నీరు లేకపోవడంతో ఈనెల 6వ తేదీ నుంచి టూరిజం అధికారులు బోటు షికారు నిలిపేశారు. ఐబీ అధికారులు మరమ్మతుల పేరుతో నీటిని వదలడంతో మళ్లీ సమృద్ధిగా వర్షాలు పడి సరస్సు నిండితేనే బోటు షికారు ప్రారంభం కానున్నది.

వీరభద్రాపురంలో మందుపాతర

నిర్వీర్యం చేసిన పోలీసులు

నిర్వీర్యం చేసిన మందు పాతర

ములుగు, జూన్ 9 (నమస్తే తెలంగాణ): పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరలతో సామాన్యులతో పాటు వన్యప్రాణులు చనిపోతున్నట్లు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దుల్లోని వెంకటాపురం(నూగూరు) మండల పరిధి అటవీ ప్రాంతంలో కొన్ని రోజులుగా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరభద్రాపురం అటవీ సమీపంలో సామాన్యులు తిరిగే కాలిబాటల వెంట మావోయిస్టులు అమర్చిన నాలుగు మందు పాతరలను ఆదివారం ఉదయం గుర్తించినట్లు పేర్కొన్నారు. అందులో మూడు పేలడంతో వన్య ప్రాణులైన ముళ్లపంది, కొండెంగ, పెంపుడు కుక్క చనిపోగా కళేబరాలను గుర్తించినట్లు వివరించారు. అక్కడే అమర్చి ఉన్న మరో మందుపాతరను బాంబు డిస్పోజల్ టీమ్ నిర్వీర్యం చేసిందని వెల్లడించారు. మావోయిస్టులకు ప్రజలు ఎవరూ సహకరించొద్దని, వారి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

ఐఐటీ అడ్వాన్స్‌లో శివాని ప్రతిభ

అధిక మార్కులు సాధించిన విద్యార్థులు

హసన్‌పర్తి, జూన్ 9: ఐఐటీ అడ్వాన్స్-2024 ఫలితాల్లో శివాని కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కే పృథ్వీరాజ్, బీ బన్ని, బీ థామస్, ఎం.కిశోర్, డీ అఖిల్, బీ నోయల్, బీ అశోక్ ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ టీ స్వామి ఆదివారం తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు కొన్నేళ్ల నుంచి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు ప్రిన్సిపాళ్లు జీ సురేందర్‌రెడ్డి, వీ చంద్రమోహన్, డైరెక్టర్ టీ రాజు, ఎన్.రమేశ్, ఏ మురళి, వీ సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.

పచ్చిరొట్ట.. అధికారుల మేత!

బినామీ లబ్ధిదారుల పేరుతో నమోదు
రాష్ట్రాలు దాటిన జీలుగ సబ్సిడీ విత్తనం
బ్లాక్ మార్కెటింగ్‌తో లక్షల్లో ఆదాయం

- అధికారులే అసలు సూత్రధారులు
- రైతుల వివరాలు విక్రయ కేంద్రాలకు చేరవేత
- తొర్రూరు ఏవో, ముగ్గురు ఏఈవోల సస్పెన్షన్‌తో వెలుగులోకి
- తప్పదొవ పట్టించేలా విచారణ అధికారి నివేదిక
- విజి'లెన్స్' వేస్తే కదలనున్న అవినీతి డొంక

రైతుల పేరున ఈ నెల 5వ తేదీ రాత్రి 10.30 గంటల తర్వాత కూడా విత్తన పర్మిట్లు జారీ చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదై ఉన్న వివరాలు

తొర్రూరు, జూన్ 9 : పచ్చిరొట్ట విత్తన విక్రయాల వ్యవహారంలో అధికారుల పాత్ర ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో జరిగిన విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ దందా రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమైంది. ఇందులో ముగ్గురు ఏఈవోల సస్పెన్షన్ వ్యవసాయశాఖలో ఉన్నతాధికారుల అవగాహన రాహిత్యానికి అద్దం పడుతోంది. ఎంతో గోప్యంగా కేవలం ఏవోల వద్ద మాత్రమే ఉండాల్సిన ఐడీ, పాస్‌వర్డ్ వివరాలు బ్లాక్ మార్కెటింగ్ కోసం విత్తన విక్రయ కేంద్రాల నిర్వాహకులకు ఇవ్వడం చూస్తే అధికారులే సూత్రధారులని తెలుస్తోంది. ఒక తొర్రూరు మండలం నుంచే 60 శాతానికి పైగా విత్తన బస్తాలు బినామీ లబ్ధిదారుల పేరుతో ఆంధ్రా రాష్ట్రానికి తరలినట్లు సమాచారం. రూ.5లక్షల మేర చేతివాటం ప్రదర్శించారని వ్యవసాయ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ తతంగంలో ఏవో స్థాయి నుంచి డీఏవో వరకు ప్రమేయం ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతిలో ఎలాంటి ప్రమేయం లేని ఏఈవోలపై చర్యలు తీసుకున్నారంటూ జిల్లాలోని మిగతా ఏఈవోలు నిరసనకు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేసింది. మహబూబాబాద్ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న జిల్లాలకు సంబంధించి అనేక మండలాల నుంచి జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనం బ్లాక్ మార్కెటింగ్ రూపంలో తరలింది. పొరుగు రాష్ట్రాల్లో వీటికి ఎలాంటి సబ్సిడీ లేకపోవడంతో అక్కడ బాగా డిమాండ్ ఉంది. బహిరంగ మార్కెట్‌లో జీలుగ విత్తనం ధర కిలోకు రూ.93 ఉండగా మన రాష్ట్రంలో ప్రభుత్వం రూ.55.80 సబ్సిడీ భరిస్తూ రూ.37.20లకు రైతు చెల్లించేలా 30కిలోల బస్తాను తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేస్తున్నది. 30కిలోల బస్తా మార్కెట్ విలువ రూ.2,790 ఉండగా ప్రభుత్వ సబ్సిడీ పోను రైతు రూ.1,116 చెల్లించాల్సి ఉంటుంది. వాస్తవానికి రెండున్నర ఎకరాలకు బస్తా చొప్పున రైతులకు విక్రయిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల టన్నుల పచ్చిరొట్ట విత్తనాన్ని వ్యవసాయ శాఖ జిల్లాలు, మండలాల వారీగా కేటాయించగా తొర్రూరు మండలానికి 500 క్వింటాళ్లు(1668 బస్తాలు) సరఫరా చేసింది. కాగా, తెలంగాణ విత్తన విక్రయ సంస్థ (ఓఎస్ఎస్‌డీఎస్) సైట్‌లో రైతు వివరాలను నమోదు చేసి అర్హత ఉన్న వారికి భూవిస్తీర్ణం ఆధారంగా విత్తనాలను కేటాయిస్తూ పర్మిట్‌ను జారీ చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఏవోలకు ఇచ్చిన ఐడీ, పాస్‌వర్డ్ కీలకం.

జీలుగ విత్తనాల బ్యాగ్

ఏఈవోల ప్రయేయం ఉందా?

సబ్సిడీ విత్తన విక్రయాలకు కేవలం ఏవోలకు మాత్రమే పర్మిట్ జారీ చేసే అధికారం ఉండగా, తొర్రూరు మండలంలో ఇందుకు భిన్నంగా ఈ వ్యవహారంలో ముగ్గురు ఏఈవోలను సస్పెండ్ చేశారు. ఏవో కే సోమకుమార్ యాదవ్, తొర్రూరు క్లస్టర్ (గ్రేడ్-2 ఏఈవో ఎం జమున, అమ్మాపురం క్లస్టర్ ఏఈవో ఆజ్మీరా దీపిక, హరిపిరాల ఏఈవో సీహెచ్ అరవింద్‌ను సస్పెండ్ చేస్తూ మూడు రోజుల క్రితం వ్యవసాయశాఖ కమిషనర్ గోపి ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి గత నెల 18 నుంచి 22 వరకు పలు దఫాల్లో తొర్రూరు మండలానికి 500 కిలోల జీలుగ విత్తనాలు వచ్చాయి. విత్తన కేటాయింపు వివరాలను క్లస్టర్ల వారీగా ఏఈవోలకు తెలియజేయాల్సి ఉండగా, 22న రాత్రి ఏఈవోలకు వాట్సాప్ ద్వారా విత్తన కేటాయింపుపై ఏవో సమాచారం చేరవేశారు. అప్పుడు అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడం, వ్యవసాయశాఖ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఈ ప్రాంతానికి రావడంతో ఏఈవోలు సబ్సిడీ విత్తనాల విక్రయంపై దృష్టి సారించలేదు. 23న ఏవో తొర్రూరులోని 4 ఆగ్రోస్, పీఏసీఎస్‌లోని విత్తన కేంద్రానికి నిబంధనలకు విరుద్ధంగా యూజర్ ఐడీ, తన పాస్‌వర్డ్‌లను అందజేసినట్లు సమాచారం. 24న ఏఈవోలు విక్రయ కేంద్రాలకు వెళ్లగా, అప్పటికే 60 శాతానికి పైగా విత్తనాలను రైతుల పేరుతో విక్రయించినట్లు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ తతంగాన్ని ఏవో దృష్టికి తీసుకుపోగా, మనకే పనిభారం తగ్గించారని, విత్తనాలు కావాల్సిన రైతులకే చేరాయి కదా అని సర్ది చెప్పాడు. విత్తనం దొరకక కడుపు మండిన రైతుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది.

రాత్రి 11 గంటలకు కూడా విక్రయాలు జరిపినట్లు వివరాల నమోదు

వాస్తవానికి విత్తన విక్రయాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు కొనసాగుతాయి. కానీ ఆన్‌లైన్‌లో విక్రయ కేంద్రాల నిర్వాహకులు రాత్రి 7 నుంచి 11 గంటలకు కూడా విత్తనాలు తీసుకెళ్లినట్లు పర్మిట్లు జారీ చేశారు. కొన్ని కేంద్రాల్లో 90శాతం వారికి తోచిన రైతుల పేరుమీద బినామీ పర్మిట్లు ఇచ్చి విత్తనాన్ని పక్కదారి పట్టించారు. 10 ఎకరాల పైబడి బీడు భూమి, మామిడి తోటలు ఉన్న రైతులను లక్ష్యంగా చేసుకుని వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అవసరం లేని వారికి విత్తనాలను విక్రయించినట్లు పేర్కొన్నారు. ఏవో కారణంగా రైతుల భూమి, బ్యాంక్ అకౌంట్ల వివరాలన్నీ కూడా ఇప్పుడు రాష్ట్రంలోని అనేక మండలాల్లో విత్తన విక్రయదారులకు అనధికారికంగా చేరిపోయాయి.

విచారణ తీరుపై అనుమానాలు..

జీలుగ విత్తనాల బ్లాక్ మార్కెటింగ్‌పై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. మరిపెడ డివిజన్ పరిధిలోకి వచ్చే తొర్రూరు మండలంలో జరిగిన బాగోతాన్ని విచారించేందుకు ఏడీఏ శోభన్‌బాబును నియమించడం అనేక అనుమానాలకు తావిచ్చింది. వాస్తవానికి విక్రయ కేంద్రాల నిర్వాహకులు, ఏఈవోలు, పలువురు రైతులు ఇచ్చిన అర్జీలు, వివరాలకు భిన్నంగా ఉన్నతాధికారులకు నివేదికను ఇచ్చారని ఆరోపణలున్నాయి. ఎన్నికల విధుల ఒత్తిడి కారణంగా ఏవో తన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఏఈవోలకు చేరవేస్తే వారు అవకతవకలకు పాల్పడ్డారని ఏడీఏ నివేదికలో పేర్కొనడంతో ఇప్పుడు ఏడీఏ, డీఏవో స్థాయి అధికారుల పాత్రపై కూడా విమర్శలు వెలుగుచూస్తున్నాయి. విచారణ పక్కదోవ పట్టాయని తెలియడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు రైతుల వద్దకు వెళ్లి ఏం జరిగిందో తెలుసుకుని విత్తన విక్రయ కేంద్రాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. అయితే, శాఖాపరమైన చర్యలకు గురైన ఏఈవోలకు మాత్రం 'మీ ప్రమేయం ఏమీ లేదని తెలుసు.. కానీ ఇప్పుడు ఏం చేస్తాం' కోర్టుకు వెళ్లండని ఉన్నతాధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారుల నిర్ణయంపై రాష్ట్రస్థాయిలో ఫిర్యాదు చేసి పునర్ విచారణకు డిమాండ్ చేసేందుకు ఏఈవోలు సిద్ధమవుతున్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి
- జార్ఖండ్ తరహా పింఛన్ అందించాలి
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

ములుగులో మాట్లాడుతున్న ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మురహరి భిక్షపతి, హనుమకొండలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు

హనుమకొండ/నెక్కొండ/చెన్నారావుపేట/మహదేవపూర్/ములుగు రూరల్, జూన్ 9: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం హనుమకొండలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేయడంతోపాటు మహదేవపూర్, ములుగు, నెక్కొండ, చెన్నారావుపేటలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం, సంఘం నాయకులు మాట్లాడుతూ 250 గజాల ఇంటి స్థలంతో పాటు జార్ఖండ్ రాష్ట్రంలో మాదిరిగా ప్రతి నెలా పింఛన్ ఇవ్వాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, హెల్త్ కార్డులు, బస్ పాస్‌లు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు ఆయూబొద్దీన్, ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షుడు మురహరి భిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శులు అల్లి యాదగిరి, కౌడగాని రాజేరు, ఉపాధ్యక్షులు మల్లాడి వీరారెడ్డి, అల్లి ఉమ, శారద, నెక్కొండ, చెన్నారావుపేట మండల అధ్యక్షులు కొత్త సంపత్‌రెడ్డి, ఉప్పునూతుల లింగమూర్తి, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి సింగారపు సునీల్ కుమార్, మహదేవపూర్ మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, మాజీ సర్పంచ్ మహబూబ్ పాషా, మాజీ ఉపసర్పంచ్ పరిపాటి ఇంద్రసేనారెడ్డి, ఉద్యమకారులు జలగం మోహన్‌రావు, అన్కారీ ప్రభాకర్, అనిత, గరిగె రఘు, బైకాని ఓదెలు, గడ్డమీది భాస్కర్, బత్తుల రాణి, మేడుదల వెంకన్న, దర్శనాల సంజీవ, కడారి తిరుపతి, కొండి రమేశ్, బానోత్ గోపి, చందు, కొండా రమేశ్, బండారి సారయ్య, ముడుసు కొమ్మాలు, మెండె నర్సయ్య, గణేశ్, ముత్తయ్య, పోశాలు, నేల మల్లమ్మ(వంటల మల్లమ్మ), రవి, మోహిని, స్వరూప, వంగ రజిత, లక్ష్మి, బండి సరోజన పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కాంగ్రెస్ నాయకుడి కారు

- బైక్‌పై ఉన్న ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు
- ఇన్నోవా కారుపై రేవంత్‌రెడ్డి స్టిక్కర్
- డిక్కీలో వన్యప్రాణి మాంసం

కాంగ్రెస్ నాయకుడి కారుపై ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో

భూపాలపల్లి రూరల్, జూన్ 9: భూపాలపల్లి మండలంలోని రాంపూర్ - కమలాపూర్ గ్రామాల మధ్య ఆదివారం రాత్రి కాంగ్రెస్ నాయకుడి ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం నుంచి భూపాలపల్లికి ఇన్నోవా కారు అతివేగంగా వస్తూ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(33) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న రేగళ్ల ప్రమోద్, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమోద్ పరిస్థితి విషమంగా ఉండగా, భూపాలపల్లిలోని దవాఖానకు తరలించారు. కాగా, ఇన్నోవా వాహన అద్దంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో స్టిక్కర్, కారులో కాంగ్రెస్ కండువా ఉన్నాయని, డిక్కీలో ఏదో వన్య ప్రాణి మాంసం లభించిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.